అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు....

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 8న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నక్కలగుట్ట మెయిన్ రోడ్డు, బాలసముద్రం, గోకుల్‌నగర్, అంబేడ్కర్ భవన్, కుడా అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సోమిడి సబ్‌స్టేషన్ ప్రాంతంలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, కేయూసీ, న్యూ శాయంపేట, టీకులగూడెం, టెక్స్‌టైల్స్ పార్కు సబ్‌స్టేషన్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, ఆర్ఈసీ సబ్ స్టేషన్ ప్రాంతంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. శివనగర్, చింతల్, పుప్పాలగుట్ట, ఖిలా వరంగల్, ఏఎస్.రెడ్డి నగర్, స్తంభంపల్లి, ఆజంజాహి మిల్ పోలీసు స్టేషన్, ఏఎస్ఎం కళాశాల, రంగశాయిపేట, వసంతపూర్, దూపకుంట, నాయుడు పెంట్రోల్ పంపు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

హసన్‌పర్తి: చింతగట్టు, మల్లారెడ్డిపల్లి, నాగారం సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ సామ్యానాయక్ తెలిపారు. ఉదయం 8గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. జయగిరి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి

విద్యారణ్యపురి: అభ్యుదయ సాహిత్యాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ మహ్మద్ రియాజ్ అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని, లేకుంటే భవిత ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వీరస్వామి మాట్లాడుతూ స్త్రీ, పురుష సమానత్వానికి అనేక అడ్డంకులు మనువాదంతో ముడిపడి ఉన్నాయని, వాటిని అధిగమించాలన్నారు.

కేఎంసీకి శరీరదానం



ఎంజీఎం: హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని సహృదయ వృద్ధాశ్రమంలో ఉంటున్న సంజీవ్ కుమార్ (80) శుక్రవారం మరణించారు. మృతుడి కుటుంబ సభ్యుల అంగీకారం, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు యాకూబీ చోటేమియా సహకారంతో కాకతీయ మెడికల్ కళాశాలకు కుమార్ పార్థివ దేహాన్ని అందజేశారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్ రెడ్డి, అనాటమీ సిబ్బంది ప్రేమ్‌కుమార్, యాదగిరి, ప్రవీణ్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కె.మల్లారెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పి.వేణు, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడు సాయిరెడ్డి, సంయుక్త కార్యదర్శి నరసింహరాములు, పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలో గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి 23వ బ్రహ్మోత్సవాలు వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య శుక్రవారం రాత్రి లాంఛనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ధ్వజారోహణం, యాగశాలలో అగ్నిప్రతిష్ఠ చేయనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పంజాల అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు. కమిటీ ప్రధాన కార్యదర్శి మేజర్ వడ్డెపల్లి నరేందర్, ఐలోని వెంకట మల్లారెడ్డి, తిరునగిరి దిలీప్ కుమార్, శనిగరపు సుజాత, పెద్ది అశోక్ కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విచారణ

హసన్‌పర్తి: ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన 'వసూల్ రాజా' కథనంపై కలెక్టర్ ప్రావీణ్య స్పందించారు. ఈమేరకు సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని పశు సంవర్ధక శాఖ హనుమకొండ జిల్లా అధికారి విజయ్‌భాస్కర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా హసన్‌పర్తిలోని పశువైద్యశాలలో ఆయన శుక్రవారం విచారణ జరిపారు.

ఐటీఐలో అడ్మిషన్లకు ఆహ్వానం

కాజీపేట: కాజీపేట ప్రభుత్వ ఐటీఐ విద్యా సంస్థలో 2024–25వ సంవత్సరానికిగాను అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎందులో అడ్మిషన్ కావాలనుకుంటే అందులోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ



ఎంపీ కడియం కావ్యను సన్మానిస్తున్న ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల అధ్యాపకులు



మామునూరు పీటీసీలో మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ



హసన్‌పర్తి: అన్నాసాగరంలోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినుల ప్రదర్శన



మామునూరు: శాస్త్రవేత్తను శాలువాతో సన్మానిస్తున్న కృషివిజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న



మహిళా దినోత్సవం సందర్భంగా కేయూ క్రీడా మైదానంలో రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న మహిళలు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఎంజీఎం: కాకతీయ వైద్య కళాశాల ఉమెన్స్, మెన్స్ హాస్టళ్లలో పనిచేస్తున్న కార్మికులకు 8 నెలలుగా పెండింగ్ ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయూఎంహెచ్ఏయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేఎంసీ మెయిన్ గేట్ ఎదుట కార్మికులు శుక్రవారం నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది నెలల పెండింగ్ వేతనాల కోసం గతంలో వివిధ రూపాల్లో ఆందోళన, పోరాటాలు చేసినా ఎలాంటి లాభం లేకపోవడంతో ముందస్తుగా సమ్మె నోటీస్ ఇచ్చి సమ్మెకు దిగినట్లు తెలిపారు. సమ్మె శిబిరాన్ని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య సందర్శించారు. కార్మికుల పెండింగ్ వేతనాలు అందించేలా కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.



కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

విదేశీ విద్యకు సహాయ సహకారం



హసన్‌పర్తి: ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులకు సహాయం సహకారాలు అందిస్తామని ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అన్నారు. హనుమకొండలోని ఎస్వీఎస్ విద్యాసంస్థలు, కెరీర్ కన్సల్టెజెడ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా ఎస్వీఎస్ కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో జర్మనీ, ఇటలీ దేశాల్లో విద్యను అభ్యసించవచ్చని అన్నారు. విదేశాల్లో చదివే విద్యార్థులకు అక్కడే ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు కెరీర్ కన్సల్టెజెడ్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. కళాశాలలో చదివిన ప్రతీ విద్యార్థికి ప్లేస్‌మెంట్ ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. కెరీర్ కన్సల్టెజెడ్ చైర్మన్ రోహిత్ మాట్లాడుతూ విదేశీ విద్య గురించి అవగాహన కల్పించారు.

అన్ని రంగాల్లో మహిళలకు గుర్తింపు



మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్

- వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్: మహిళలకు అన్ని రంగాల్లో ప్రత్యేక గుర్తింపు లభిస్తోందని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. టీఎన్జీఓ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవంలో కలెక్టర్ మాట్లాడారు. గృహిణి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రుల పెంపకంలో అమ్మాయిలు సెన్సిటివ్‌గా మారుతున్నారని పేర్కొన్నారు. మహిళలు అనగానే సానుభూతి, త్యాగాలకు ప్రతీక ఒకప్పటి మాట అని, ప్రస్తుతం కొన్ని సమయాల్లో కఠినత్వాన్ని ప్రదర్శించక తప్పదని కలెక్టర్ అన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, అధికారులు పాల్గొన్నారు.

జ్యూట్ ఉత్పత్తులపై అవగాహన అవసరమని కలెక్టర్ సత్యశారద అన్నారు. వరంగల్‌లోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. జనపనార ఉత్పత్తులు, మార్కెటింగ్ తదితర అంశాలతో కూడిన జూట్ మార్క్ ఇండియా పథకంపై భారత ప్రభుత్వ టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ, టెక్స్‌టైల్ కమిటీ అసిస్టెంట్ డైరెక్టర్ జె.నిశాంత్ మేత్రాస్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ మహిళలకు వివరించారు.

పర్యావరణంపై అవగాహన అవసరం

- హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి



విద్యారణ్యపురి: విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని, పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా భావించాలని హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి సూచించారు. హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ రోడ్డులోని ఏకశిల హైస్కూల్‌లో నేషనల్ గ్రీన్‌కార్ప్స్, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన పర్యావరణ రహిత సబ్బు తయారీశాలలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసస్వామి, ఎన్జీసీ ప్రాంతీయ కోఆర్డినేటర్ విద్యాసాగర్, హెచ్ఎం శైలజారెడ్డి, ఉపాధ్యాయులు సంపతి, సునీత, వీరస్వామి, చంద్రమోహన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

10 నుంచి ఎఫ్ఎల్ఎస్ సర్వే చేయాలి

కాశీబుగ్గ సెంటర్: ఎంపిక చేసిన 50 పాఠశాలల్లో రెండో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరీక్షించడానికి ఈనెల 10, 11, 12వ తేదీల్లో ఎఫ్ఎల్ఎస్ సర్వే చేయాలని వరంగల్ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుజన్‌తేజ అన్నారు. సర్వే నిర్వహించేందుకు డైట్ విద్యార్థులను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా ఎంపికచేసి 2రోజుల శిక్షణను కరీమాబాద్ పాఠశాలలో శుక్రవారం ప్రారంభించారు. రిసోర్స్‌పర్సన్స్ కుమారస్వామి, రఘుపతి, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు పాల్గొన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

హన్మకొండ: సమాజంలో జరుగుతున్న మోసాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు, కన్స్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నేషనల్ సీనియర్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. హనుమకొండ ఎక్సైజ్ కాలనీలో జిల్లా వినియోగదారుల సలహా సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల చైతన్య సదస్సు శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్.హైమావతి, మల్యాల మనోహర్ రావు, జిల్లా వినియోగదారుల సలహా సంఘం సభ్యులు జ్యోత్స్న, విజయలక్ష్మి, అనూష, మంజుల, కవిరాజ్, సతీష్, నరేష్ పాల్గొన్నారు.

మహిళల హక్కులను అమలు చేయాలి

ఖిలా వరంగల్: పోరాడి సాధించుకున్న మహిళా సమాన హక్కులను అమలు చేయాలని ఐద్వా వరంగల్ జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. వరంగల్ రైల్వే స్టేషన్ కాకతీయ తోరణం వద్ద అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ కోశాధికారి రంగరాజు విజయ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. అప్పాజీవాణి, బిట్ల స్వప్న, ఎండీ.ఫరీదా, అవుల మంజుల, పోశాల కీర్తి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

'మళ్లీ సతీసహగమనం వైపు బీజేపీ'

హసన్‌పర్తి: మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ సర్కార్.. సనాతన ధర్మం పేరుతో దేశంలో మనుధర్మ సిద్ధాంతాన్ని, సతీ సహగమనం, బాల్యవివాహం, వితంతు విధానాన్ని తీసుకురావడానికి యత్నిస్తోందని సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య ఆరోపించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని హసన్‌పర్తి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు శ్రీలత, ప్రణయ్, సునీత, దేవమ్మ, సుజాత పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు చేపట్టిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. 20 మంది విద్యార్థులు భౌతిక, రసాయన, జీవ, వృక్షశాస్త్రాలకు సంబంధించి ప్రయోగాలను ప్రదర్శనకు ఉంచారు. ప్రధానోపాధ్యాయురాలు మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎగ్జిబిట్లను పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తిలకించారు.

సమాన అవకాశాల కోసం పోరాడాలి

విద్యారణ్యపురి: సమాన అవకాశాల కోసం మహిళలు పోరాడాలని, ఉన్నత విద్యలో స్త్రీల ప్రాతినిథ్యం పెరగాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి పద్మజ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని కనిష్క మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు, రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్, జిల్లా కమిటీ బాధ్యులు హనుమాన్, ప్రసాద్, వెంకట నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు కార్మికుల ధర్నా

హన్మకొండ చౌరస్తా: కార్మిక చట్ట ప్రకారం తమకు రావాల్సిన బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ కళ్యాణలక్ష్మి, శ్రీరస్తు షాపింగ్‌మాళ్లలో పనిచేసిన కార్మికులు.. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా రెండో రోజు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి మాట్లాడుతూ ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా షాపింగ్ మాళ్లను మూసివేశారని సదరు యాజమాన్యాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంకటేశ్వర్లు, వెంకట్‌నారాయణ, నాగరాజు, రమేష్, జయ, రాధిక, రమాదేవి, లావణ్య, ఎజాస్, సందీప్, మహేష్, నవీన్, అమీద్, రాజేష్‌ఖన్నా, సురేష్, ప్రవీణ్, రమేష్, మహేందర్, యాదగిరి, సదానందం పాల్గొన్నారు.

మహిళలకు సమాన వేతనం ఇవ్వాలి

కాజీపేట: దేశంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను అరికట్టి, పురుషులతో సమానంగా అతివలకూ సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. కాజీపేట మండలం సోమిడి గ్రామంలో సీఐటీయూ మండల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీని ఆయన గురువారం ప్రారంభించారు. సోమిడి నుంచి కాజీపేట చౌరస్తా వరకు మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

పద్మశాలి మహాసభను విజయవంతం చేయాలి

వరంగల్: ఈనెల 9వ తేదీన హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించనున్న అఖిల భారత పద్మశాలి సంఘం 17వ మహాసభ, తెలంగాణ ప్రాంత 8వ మహాసభను విజయవంతం చేయాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆడెపు రవీందర్, పట్టణ సంఘం గౌరవ అధ్యక్షుడు, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్‌కుమార్ పిలుపునిచ్చారు. పోచమ్మమైదాన్‌లోని సంఘం భవనం వద్ద మహాసభ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్, గోరంటల రాజు, కుమారస్వామి, సురేష్, సాంబయ్య, వేముల నాగరాజు, కమలాకర్, రాజేశ్, క్యాతం రంజిత్, ఆంజనేయులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో సెయింట్ పీటర్స్ విజయభేరి

హన్మకొండ: హనుమకొండ విద్యుత్‌నగర్‌లోని యాజుర్ స్కూల్‌లో ఇటీవల జరిగిన విజ్ఞాన ప్రదర్శనలో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచి నగదు బహుమతి అందుకున్నారని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.మత్యాస్ రెడ్డి తెలిపారు. ఈమేరకు విజేతలకు బహుమతులు ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు.

బంజారా భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలి

హన్మకొండ: బంజారా భాష 'గోర్‌బోలి'ని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని బంజారా సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ జి.వీరన్న నాయక్, అధ్యక్షుడు జి.సజ్జన్ నాయక్, ప్రధాన కార్యదర్శి ఎల్.దాస్యా నాయక్ కోరారు. ఈమేరకు జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు లేఖ రాసినట్లు వారు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నివసిస్తున్న బంజారా, లంబాడీ, సుగాలితో పాటు సుమారు 31 రకాల ఉప జాతులుగా పిలువబడి, వేషధారణ, సంస్కృతి, సంప్రదాయాల్లో ఒకే విధానాన్ని ఆచరిస్తూ, గోర్ బోలి భాషను తమ మాతృభాషగా ఆచరిస్తున్నారని వివరించారు.

11న జూనియర్ లెక్చరర్ అభ్యర్థుల పోరుబాట

కేయూ క్యాంపస్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు, బాధ్యులు వాపోయారు. ఈక్రమంలో ఈనెల 11న హైదరాబాద్‌లో ఆయా అభ్యర్థులు చేపట్టనున్న పోరుబాట మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ కేయూ మొదటి గేట్‌వద్ద పోరుబాట పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం బాధ్యులు సతీష్, పాషా, వంశీ, వెంకటకృష్ణ, రమేష్, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆపద సమయంలో ఆదుకునేందుకే గోల్డ్‌లోన్ మిషన్

వరంగల్: ఆపద సమయంలో బంగారాన్ని బ్యాంకులో పెట్టి త్వరగా డబ్బులు తీసుకునే కష్టమర్ల కోసం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశంలోనే తెలంగాణ వరంగల్‌లో గోల్డ్ లోన్ మిషన్‌ను అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు బ్యాంక్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ ఎంవీ.రావు తెలిపారు. వరంగల్ కొత్తవాడలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులో నూతన గోల్డ్ లోన్ మిషన్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. జనరల్ మేనేజర్లు వివేక్‌కుమార్, దారాసింగ్ నాయక్, రీజినల్ మేనేజర్ వి.కృష్ణమోహన్, బ్రాంచ్ మేనేజర్ గోపి నాయక్, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంధులు మనోనేత్రంతో చూడగలరు

రామన్నపేట: అంధులు మనో నేత్రంతో ప్రపంచాన్ని చూడగలుగుతారని కేయూ పాలక మండలి సభ్యురాలు, వరల్డ్ వైడ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనితారెడ్డి అన్నారు. ఆటోనగర్‌లోని లూయిస్ ఆదర్శ పాఠశాలలో విజన్ ఎంపవర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అంధ విద్యార్థులతో శుక్రవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు.

వక్తృత్వ కళను మెరుగు పర్చుకోవాలి

ఖిలా వరంగల్: విద్యార్థులు వక్తృత్వ, కళా నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలని మిమిక్రీ కళాకారుడు, వ్యాఖ్యాత సంతోష్ కుమార్ సూచించారు. వరంగల్ ఉర్సుగుట్ట రోడ్డులో తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ తాళ్ల మల్లేశం ఆధ్వర్యంలో డైరెక్టర్ డాక్టర్ తాళ్ల వరుణ్ అధ్యక్షతన టీడ్ – ఈడ్ పబ్లిక్ స్పీకింగ్ పోటీలను నిర్వహించారు.

గుర్తింపులేని యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలి

కాజీపేట: ప్రజలు విజ్ఞతతో ఆలోచించి గుర్తింపులేని యాప్‌ల వలలో చిక్కుకోవద్దని కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నానాటికి సైబర్ నేరగాళ్లు నూతన తరహాలో మోసాలకు పాల్పడుతున్న విషయాలను ప్రజలు గుర్తెరిగి జాగ్రత్త ఉండాలని సూచించారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి



హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డితో కలిసి ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

- నగర మేయర్ గుండు సుధారాణి



వరంగల్: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా నీటి సరఫరా జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఇంజనీరింగ్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వేసవిలో బల్దియా పరిధిలోని 66 డివిజన్లలో తాగునీరు సరఫరాకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలపై సమీక్షించి పక్కాగా నిర్వహించుటకు మేయర్ పలు సూచనలు చేశారు.